సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025


శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో శోభాయాత్ర


మిల్లు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సూర్యనమస్కారాల విగ్రహాలు

నేలపై సూర్య నమస్కారాల విన్యాసాలు, నింగిలో హెలికాప్టర్ సవారీలు, ఆలయంలో సౌర హోమ మంత్రాలు, మైదానంలో గ్రామీణ క్రీడల పోటీలతో రథ సప్తమి ఉత్సవం వైభవంగా మొదలైంది. ఆదిత్యుని జయంత్యుత్సవాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో తొలిరోజు కార్యక్రమాలను కట్టుదిట్టంగా చేపట్టారు. నేటి అర్ధరాత్రి నుంచి క్షీరాభిషేక వేడుక మొదలుకానుంది. అరసవల్లి జంక్షన్‌లో విగ్రహాల కొలువు, సూర్య రథచక్రం విగ్రహం వంటివి భక్తులను ఆకట్టుకున్నాయి.

నభోమూర్తి మురిసేలా..

నగరం మెరిసేలా..


అరసవల్లి మిల్లు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సూర్య భగవానుడి విగ్రహం

- అట్టహాసంగా రథ సప్తమి వేడుకలు ప్రారంభం
- నేటి అర్ధరాత్రి నుంచి స్వామికి క్షీరాభిషేకం
- మొదటి రోజు 3 వేల మందితో సామూహిక సూర్యనమస్కారాలు
- ఆలయంలో ఘనంగా మహా సౌరహోమం
- డచ్ బంగ్లా వద్ద లోహ వి'హంగామా'
- క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జిల్లా కేంద్రంలో ఉత్సవ శోభ

అరసవల్లి: ప్రఖ్యాత అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో రథ సప్తమి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి సారి మూడు రోజుల పాటు వేడుక నిర్వహిస్తుండడంతో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం సామూహిక సూర్యనమస్కారాల ప్రక్రియను స్థానిక 80 ఫీట్ రోడ్డులో ప్రారంభించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఆర్డీవో సాయి ప్రత్యూష తదితర అధికారులంతా కలిసి యోగాసనాలను వేశారు. దాదాపు 3వేల మంది 12రకాల ఆసనాలు వేశారు. యోగా గురువు రామారావు ఆధ్వర్యంలో వివిధ యోగా నిర్వాహక సంస్థలు, పతంజలి యోగా, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సూర్య ప్రణవ పతంజలి యోగ, ఓం శాంతి, ఎన్జీవో తదితర సంస్థల సభ్యులు, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎస్.నారాయణరావు తదితర శాఖాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


80 అడుగుల రోడ్డులో సామూహిక సూర్యనమస్కారాలు

కేంద్రమంత్రి వస్తున్నారని తెలిసి

సామూహిక సూర్య నమస్కారాలు జరుగుతుండగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు రావడంతో.. కలెక్టర్ తదితర అధికారులంతా యోగాసనాలను మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా వారు వెళ్లిపోయారు.

శాస్త్రోక్తంగా సౌర హోమం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం సౌరహోమంతో రథసప్తమి మహోత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ వై.భద్రాజీ సమక్షంలో వేదమంత్రాలు, మంగళధ్వనుల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతుల గోత్రనామాలతో ఈ హోమాన్ని నిర్వహించారు.


శోభాయాత్రలో కొమ్ము నృత్యం


అరసవల్లి మిల్లు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రథచక్రం

అపురూపం

అరసవల్లి: రథ సప్తమి వేళ అరసవల్లి మిల్లు జంక్షన్ అపురూపంగా మారింది. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రజారోగ్య విభాగ ఎస్ఈ సుగుణాకర రావు పర్యవేక్షణ లో జరిగిన ఈ సుందరీకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. అరసవల్లికి మార్గం చూపేలా అద్భుతంగా ఫైబర్ రెయిన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్ (ఎఫ్ఆర్‌పి)తో తయారు చేసిన 18 అడుగుల సూర్యరథ చక్రం చూపరులను ఆకట్టుకుంటోంది. దీనికి ముందు ఏడు గుర్రాలతో శ్రీసూర్యనారాయణుని విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక వీటితో పాటు 'సూర్య నమస్కారాలను' ప్రతిబింబించేలా.. ఇదే మార్గంలో అద్భుతంగా 12 రకాల సూర్యనమస్కారాల భంగిమల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

పసగాడ విగ్రహం ఏర్పాటు

మాజీ ఎమ్మెల్యే దివంగత పసగాడ సూర్యనారాయణ విగ్రహాన్ని ఆయనకు చెందిన మిల్లు కూడలిలోనే ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో తర్వాత ప్రారంభిస్తారు.

నేటి అర్ధరాత్రి నుంచే క్షీరాభిషేకం

అరసవల్లి

- ఎన్నికల కోడ్ ఆంక్షల నడుమ దర్శనాలు
- దాతల పాసులపై తగ్గని ఆందోళన
- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామీజీకి అందని ఆహ్వానం

అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో సోమవా రం అర్ధరాత్రి నుంచి క్షీరాభిషేక సేవ ప్రారంభం కానుంది. సూర్య జయంత్యుత్సవాల్లో ప్రధానమైన సప్తమి నాడు అరుదైన అద్భుత నిజరూపంతో పాటు పంచామృతాలతో అభిషిక్తుడైన శ్రీ సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టును తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. అర్ధరాత్రి 12.30 గంటలకే దివ్యమూర్తికి అభిషేకానికి ముహూర్తం నిర్ణయించారు. ఉదయం 7 గంటల వరకు జరిగే క్షీరాభిషేకానికి భక్తుల కోసం కోవా ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు. నిజరూప దర్శనం మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఆదిత్యుడిని స్వర్ణాభరణాలతో అలంకరిస్తారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో..

ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వీఐపీల దర్శనాల విషయంలో చాలా జాగ్రత్తలు, నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను కూడా ప్రజాప్రతినిధులు సమర్పించే అవకాశం లేదు. అలాగే దర్శనాల విషయంలో కూడా ఎక్కడా ప్రోటోకాల్ అమలు చేయకూడదు. ఈ మేరకు ఇప్పటికే కలెక్టర్ నుంచి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు అందాయి.

స్వరూపానందేంద్ర స్వామీజీకి అందని ఆహ్వానం

కూటమి ప్రభుత్వం వచ్చాక ఏళ్ల నాటి సంప్రదాయాలకు స్వస్తి చెబుతున్నారు. ఏటా విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ రథసప్తమి వేళ తొలి అభిషేకాన్ని నిర్వహించేవారు. కొన్ని దశాబ్దాలుగా ఇదే ఆనవాయితీగా వస్తోంది. కానీ ఇప్పుడు కనీసం శారదాపీఠానికి ఆహ్వానం కూడా పంపించలేదు. ఇదేం పద్ధతి అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా స్వామిజీ తొలి అభిషేకాన్ని చేసిన సంగతిని స్థానికులు గుర్తుకు తెస్తున్నారు.

న్యూస్‌రీల్

లోహ వి'హంగామా'


విహారానికి సిద్ధమైన హెలీకాప్టర్

శ్రీకాకుళం: కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న డచ్‌భవనం మైదానంలో ఆదివారం ప్రారంభించిన హెలీ టూరిజంకు చక్కటి స్పందన లభించింది. పొగమంచు కారణంగా ఉదయం 11.30కు హెలీకాప్టర్ రైడ్ ప్రారంభమైంది. ప్రారంభోత్సవంలో కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. కొందరికి ఆన్‌లైన్ టికెట్లు కొనడం రాకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మబ్బులు, పొగమంచు కా రణంగా 4.30 గంటలకు హెలికాప్టర్ రైడ్ నిలిపివేశారు.

గ్రీవెన్సులు రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్/ శ్రీకాకుళం క్రైమ్ : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా కలెక్టర్, ఎస్పీ గ్రీవెన్స్‌లు రద్దు చేశారు. కోడ్ ముగిశాక మళ్లీ యథావిధిగా ఈ కార్యక్రమాలు జరుగుతాయి.

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

అరసవల్లి, శ్రీకాకుళం క్రైమ్: రథసప్తమి మహోత్సవాల ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదివారం ఉదయం స్వయంగా పరిశీలించారు. ఆదిత్యాలయానికి ఎస్పీ మహేశ్వర రెడ్డితో కలిసి వెళ్లి దర్శన మార్గాలన్నీ కలియతిరిగారు.

'శోభా'యమానం


ఆకట్టుకున్న అమ్మవారి వేషధారణలు

శ్రీకాకుళం కల్చరల్: రథసప్తమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన శోభాయాత్ర అందరి దృష్టిని ఆకర్షించింది. డే అండ్ నైట్ కూడలి నుంచి అరసవల్లి ముఖద్వారం వరకు జరిగిన శోభాయాత్రలో కళాకారులు, కళా బృందాలు పాల్గొని ప్రదర్శన చేశాయి. ముందు అరసవల్లి సూర్యనారాయణ స్వామి సప్తాశ్వరూఢుడై బయల్దేరగా.. వెనుక దేవస్థానాల శకటాలు వెళ్లాయి.


ఆకట్టుకున్న లేజర్ షో

అంతటా విద్యుత్ మెరుపులు

రథ సప్తమి సందర్భంగా ప్రధాన మార్గం అంతా విద్యుత్ పందిళ్లు, సెంట్రల్ లైటింగ్, ఇతరత్రా విద్యుత్ సెట్టింగులతో నింపేశారు. ఆలయంలో కూడా అనివెట్టి మండపంతో పాటు వివిధ మండపాలన్నీ పువ్వులతో అలంకరణ చేశారు.


హాస్య నటుల సందడి

ఇదేనా దాతలకిచ్చే గౌరవం..?

- అరసవల్లి దేవాలయం దాతలపై పగబట్టిన పాలకులు
- దాతల సాయంతో నిర్మించిన కట్టడాలను సమాచారం లేకుండా కూల్చివేత
- దర్శన పాసులకు కోత పెట్టిన దుస్థితి


ఆలయం ముందు నిర్మాణాల కూల్చివేత

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : అరసవల్లి దేవస్థానం దాతలపై పాలకులు పగబట్టినట్టు ఉన్నారు. ఒకవైపు దాతల చొరవతో నిర్మించిన కట్టడాల కూల్చివేతపైన, మరోవైపు దాతలకు ఇవ్వాల్సిన పాసులను తగ్గించడంపైన మనస్తాపం చెందుతున్నారు. తమ సాయంతో నిర్మించిన కట్టడాలను కూల్చడం ద్వారా పేరు పోయిందని, దాంతో పాటు తమకు ఇవ్వాల్సిన పాసులు కూడా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ నిధులతో హడావుడి పనులు

రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా ప్రకటించారు. కానీ ప్రత్యేకంగా నిధులిచ్చేది లేదని జీఓలోనే ప్రభుత్వం చెప్పేసింది. దీంతో కార్పొరేషన్‌లోనూ, శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)లో ఉన్న నిధులతో పండగ ఏర్పాట్లు చేసేశారు. హడావుడిగా పాలకొండ రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌తో ఉన్న డివైడర్లను కూల్చేసి కొత్తగా డివైడర్ నిర్మాణం చేపట్టి, దాంట్లో మళ్లీ కొత్తగా సెంట్రల్ లైటింగ్ పెట్టారు. పాత బస్టాండ్ నుంచి అరసవల్లి దగ్గర వరకు పాత లైటింగ్‌ను పక్కన పెట్టేసి సెంట్రల్ లైటింగ్ పెట్టారు. ఇక మిల్లు జంక్షన్ దగ్గర బ్యూటిఫికేషన్ పనులైతే కట్టడం, కూల్చడం, కట్టడం, కూల్చడం, కట్టడం వంటివి జరిగాయి. ఇక, ప్రధాన కూడళ్లకు, డివైడర్లకు ఉన్న రంగులను చెరిపేసి కొత్త రంగులు వేశారు. ఈ పనులన్నింటికీ ఎప్పుడు కాంట్రాక్ట్ పిలిచారో ఎవరికిచ్చారో స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ఈ కాంట్రాక్ట్‌ల విషయంలో పెద్ద ఎత్తున చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. నాణ్యతపైనా అనుమానాలు ఉన్నాయి.

దాతలపై కక్ష

దాతల విషయానికొచ్చే సరికి పాలకులు కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ చేపట్టే అనేక నిర్మాణాలు దాతల సాయంతో చేసినవే. రాష్ట్ర పండగగా గుర్తించాక ప్రస్తుత పాలకులు ఆలయం విస్తరణ పేరుతో కూల్చివేతలకు దిగింది. ఇప్పటికే అన్నదాన మండపం, ప్రసాదాల కౌంటర్, సూర్య నమస్కారాల మండపం, మరుగుదొడ్ల కాంప్లెక్స్, భక్తులకు నీడనిచ్చే జింకు రేకు షెడ్లను, క్యూలను కూల్చివేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రసాద్ స్కీమ్ వస్తుందని చెప్పి ఇవన్నీ చేశారు. స్కీమ్ మంజూరైన తర్వాత ఈ పనులు చేపట్టి ఉంటే బాగుండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కూల్చివేతల విషయాన్ని కనీసం దాతలకైనా చెప్పలేదు. ఈ వైఖరి దాతలు మనసులను నొప్పిస్తోంది.

పాసుల విషయంలోనూ..

1996 నుంచి దేవస్థానానికి దాతలు విరాళాలిస్తున్నారు. వారికి రథసప్తమి రోజున గౌరవించేలా ప్రత్యేక పాసులిచ్చి దర్శనం కల్పిస్తుంటారు. రూ.లక్ష విరాళం ఇస్తే ఒక డోనర్ పాస్, రూ. రెండు లక్షలు ఇస్తే రెండు డోనర్ పాసులు...ఇలా ఎన్ని లక్షలు ఇస్తే అన్ని డోనర్ పాసులు ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యంగా మంత్రి అచ్చెన్నాయుడు ఎందుకో దాతలపైనే పడ్డారు. వారికిచ్చే పాసులపై కఠినంగా వ్యవహరించాలని సాక్షాత్తు స మావేశంలోనే ఆదేశించారు. దీంతో దాతల పాసుల వ్యవహారం సమస్యగా మారింది. తొలుత దాతలందరినీ ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పడమే వివాదాస్పదం కాగా, ఇప్పుడా దాతలకిచ్చే పాసుల విషయంలో కూడా వివాదం చోటు చేసుకుంది. రూ.రెండు లక్షలు కట్టిన వారికి ఒక పాసు, రూ.మూడు లక్షలు కట్టిన వారికి ఒకటే పాసు, రూ. 4లక్షలు కట్టిన వారికి రెండు పాసులు, రూ. 5లక్షలు కట్టిన వారికి మూడు పాసులు ఇస్తున్నారు. ఒకాయన రూ.14లక్షలు కడితే కేవలం ఐదు పాసు లే ఇచ్చారు. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులకు మాత్రం వీరికంటే కాస్త ఎక్కువ ఇచ్చారు. దీనిపైనే చర్చ జరుగుతుంది.

సాక్షాత్తు తిరుపతిలోనే రూ. లక్ష విరాళం ఇస్తే ఏడాదిలో ఐదుగురికి రూ.300 టికెట్ల తో పాటు రూమ్ ఇస్తారు. కానీ అరసవల్లిలో మాత్రం దర్శన భాగ్యం కల్పించలేకపోతున్నారు. దీనిపై సాక్షాత్తు కలెక్టర్ ఎదుట ఒక తెలుగుదేశం పార్టీ నాయకుడే గట్టిగా అడిగారు.

క్లుప్తంగా

టిఫిన్ షాపులోకి దూసుకెళ్లిన లారీ



షాపులోకి దూసుకుపోయిన లారీ

ఆమదాలవలస: మండలంలోని పార్వతీశం పేట జంక్షన్ వద్ద ఆమదాలవలస– హిరమండలం రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున సరుబుజ్జిలి వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న టిఫిన్ షాపులోకి దూసుకెళ్లింది. పార్వతీశంపేట జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. తెల్లవారుజామున షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని అంటున్నారు. పొగమంచు కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

చిత్తడి నేలలతోనే జీవం మనుగడ



సోంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

సోంపేట: చిత్తడి నేలలను పరిరక్షించడంతోనే జీవం మనుగడ సాధ్యమవుతుందని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ చిత్తడి నేలలు దినోత్సవం సందర్భంగా సోంపేటలో ఆదివారం పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, పర్యావరణ పరిరరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో కళాసీసంఘ భవనంలో విద్యార్థులకు చిత్తడిశేలలు పరిరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కృష్ణమూర్తి, గ్రీన్ క్లెమైట్ వ్యవస్థాపకుడు జె.వి.రత్నం, పర్యావరణ పరిరక్షకుడు బి.సత్య తదితరులు ప్రసంగిస్తూ చితడి నేలల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామినాయుడు, పాపారావు, ఎం.ఈశ్వరరావు, పర్యావరణ, మత్స్యకార నాయకులు బి.సుందరరావు, సనపల శ్రీరామమూర్తి, ఎస్.విజయ్‌కుమార్, నాగు, వెంకన్న, టి.తేజేశ్వరరావు, బి.శంకరరావు, కోదండరావు, సత్యరాజ్ పాల్గొన్నారు.

ఎండీఎం హెల్పర్‌పై రాజకీయ కక్ష



బొడ్డేపల్లి రమణమ్మ

పొందూరు: తనను రాజకీయ కక్షలతో అన్యాయంగా తొలగించారని తాడివలస ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకురాలు బొడ్డేపల్లి రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీకి ఎటువంటి అధికారం లేనప్పటికీ గత ఆగస్టులో తొలగించారని, హైకోర్టును ఆశ్రయించడంతో నెల రోజుల్లో విధుల్లో చేరానని, తాజాగా మరోసారి తనను తొలగిస్తూ నోటీసులు అందజేశారని వాపోయారు. మూడు ఏజెన్సీలకు చెందిన ముగ్గురు మహిళలు ఉమ్మడిగా వంట చేస్తున్నా కేవలం తాను వైఎస్సార్‌సీపీకి అనుకూల వ్యక్తికావడంతో ఎలాగైనా తొలగించాలని కక్ష కట్టారని, లేనిపోని ఆరోపణలు చేస్తూ అన్యాయంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఏజెన్సీలు ఉండగా తనను మాత్రమే బాధ్యురాలిగా చేయడం రాజకీయ కుట్ర కాకుండా మరేంటని ప్రశ్నించారు. తన భర్త కూలిపనులకు వెళ్తున్నాడని, కుమారుడు చెవిటి, మూగవాడని, ఇదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. తన కుమారుడి పెన్షన్ కూడా తీయించేస్తామని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. తనకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు.

చదువు వద్దన్నారని..

- విద్యార్థిని ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎచ్చెర్ల మండలం కొంగరాం పంచాయతీ ఏజీఎన్‌పేటకు చెందిన మింది పూర్ణ (19) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(ఎంపీసీ) మొదటి ఏడాది చదువుతున్న పూర్ణ డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువులు చదువుతానని కుటుంబ సభ్యులతో చెప్పింది. కుటుంబ సభ్యులు మాత్రం వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెచ్చి సమీప గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి నిశ్చయించారు. దీంతో మనస్థాపానికి గురైన యువతి గత నెల 22న పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా.. పది రోజులుగా మృత్యువుతో పోరాడి ఆదివారం మృతి చెందింది. తండ్రి గణేష్ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసునమోదు చేశారు.

క్రీడోత్సాహం

- హోరాహోరీగా రథసప్తమి క్రీడాపోటీలు
- ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు
- జిల్లాస్థాయిలో వెయిట్‌లిఫ్టింగ్, గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహణ
- విజేతలకు నేడు బహుమతులు అందజేత



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణి

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లిలో రాష్ట్రస్థాయిలో జరుగుతున్న రథసప్తమి వేడుకలు పురస్కరించుకుని శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడా మైదానం వేదికగా ఆదివారం గ్రామీణ క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతుండగా, మిగిలిన గ్రామీణ క్రీడలు కోలాహలంగా సాగాయి. విజేతలకు సోమవారం బహుమతులు అందిస్తారు.

ఫ్లడ్‌లైట్ల వెలుగులో..

రాష్ట్ర నలుమూలల నుంచి వాలీబాల్ పురుషుల జట్లు హాజరుకావడంతో క్రీడాప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రెండు కోర్టులు, మరో సబ్‌కోర్టుల్లో మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. సోమవారంతో ఈ పోటీలు ముగియనుండగా విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

కన్నులపండువలా గ్రామీణ క్రీడలు..

జిల్లాస్థాయిలో జరిగిన గ్రామీణ క్రీడల పోటీలు కన్నుల పండువలా సాగాయి. వెయిట్‌లిఫ్టింగ్, కరస్రాము, కత్తిసాము, సంగిడీలు, ఉలవల బస్తాల లిఫ్టింగ్, పిల్లిమొగ్గలు వంటి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. స్థానిక యువత, అభిమానులు పెద్దఎత్తున హాజరై ప్రోత్సహించారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు క్రీడాపోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే కాసేపు కర్రసాముచేసి సందడి చేశారు. కేంద్రమంత్రి, ఎమ్మెల్యే వాలీబాల్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు, వాలీబాల్ సంఘ జిల్లా కార్యదర్శి వై.పోలినాయుడు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, చల్లా జగదీష్, డీఎస్‌ఏ కోచ్‌లు, పీడీలు, క్రీడాసంఘాల ప్రతినిధులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కర్రసాములో బుడతడి విన్యాసం



వాలీబాల్ పోటీలో క్రీడాకారులు

పెళ్లికి ఒప్పుకోలేదనే..

- మహిళా కళాశాల విద్యార్థినిపై దాడి
- రిమాండ్‌కు నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రీకాకుళం మహిళా కళాశాల విద్యార్థినిపై దాడి ఘటన మిస్టరీ వీడింది. విద్యార్థిని పెళ్లికి ఒప్పుకోలేదని పరిచయస్తుడే దాడి చేశాడని విచారణలో పోలీసులు నిర్ధారించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. పదో తరగతితో చదువు మానేసి సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తున్న సారవకోట మండలానికి చెందిన కణితి జగదీష్‌తో బాధిత విద్యార్థినికి కొద్దిరోజులుగా పరిచయముంది. గురువారం రాత్రి 7:32 గంటలకు విద్యార్థినితో పాటు జగదీష్ కళాశాల లోపలకు వెళ్లాడు. తిరిగి జగదీష్ ఒక్కడే 7:47 గంటలకు తీవ్ర ఒత్తిడిలో బయటకు వచ్చాడు. ఈ దృశ్యాలన్నీ ఎదురుగా ఉన్న సీసీ ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. ఈ పావుగంట సమయంలోనే పెళ్లి గురించి వాగ్వాదం జరగడం, విద్యార్థిని నిరాకరించడంతో జగదీష్ దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం జగదీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లైంగిక దాడి కాదు..

విద్యార్థినిపై లైంగిక దాడి జరగలేదని వైద్యులు నిర్ధారించారని, క్లూస్ టీమ్, సైంటిఫిక్, టెక్నికల్ ఎవిడెన్సులు అవే నిరూపితం చేశాయని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రస్తుతం విద్యార్థిని చికిత్స పొందుతోందని, ప్రాణాపాయం దాటిందన్నారు. ఆడబిడ్డకు ఇష్టం లేదని చెప్పినా ఇలా దాడి చేసి ఒప్పించాలనుకోవడం వంద శాతం తప్పని చెప్పారు. ఇకపై కళాశాలల్లో ఎగ్జిబిషన్లు వంటివి ఏర్పాటు చేయకుండా కలెక్టర్‌కు నివేదిక పంపించామని తెలిపారు. సీసీ కెమెరాలు మూడున్నాయని, మరికొన్ని ఏర్పాటు చేసే పనిలో ఉన్నామన్నారు. ఎస్పీతో పాటు డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి సెలవు ప్రకటించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అరసవల్లి సూర్యనారాయణ స్వామి కొలువై ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రథసప్తమి వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా రథసప్తమి నాడు స్వామివారిని దర్శించుకునే భాగ్యం కలిగించేలా మంగళవారం ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలోని అన్ని శాఖల కార్యాలయాలకు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించేలా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చొరవ తీసుకుని తన ప్రత్యేక అధికారాలతో సెలవు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు ఏపీఎన్‌జీవో సంఘ నాయకులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు, పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రతినిధులు ప్రభుత్వానికి వేరువేరు ప్రకటనల్లో విజ్ఞప్తి చేస్తున్నారు.

సందడే సందడి



ఆకట్టుకున్న జోష్ శివ బృందం ప్రదర్శన



రేలారే రేలా గౌరీశంకర్ ప్రదర్శన



అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన



విజయనగరం కళాకారుల డ్యాన్స్



డ్యాన్స్‌తో హోరెత్తించిన 'ఢీ' భూమిక

రథసప్తమి పర్వదినం సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అదరహో అనిపించాయి. లైట్ మ్యూజిక్, లేజర్ షో, సినీ సంగీతం, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వరరావు బృందం, యామినీకృష్ణ, లక్ష్మీగణపతి శర్మ బృందం పాడిన గీతాలు ఆకట్టుకున్నాయి. పరిమళ బృందం, అనురాధ బృందం శాస్త్రీయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆటో రాం ప్రసాద్, శాంతిస్వరూప్, నరేష్, నవీన్ బృందం కామెడీ స్కిట్స్‌తో నవ్వించారు. ఢీ భూమిక డ్యాన్స్‌తో అదరగొట్టింది. చివరగా అంజనా కళాసంస్థ ఆధ్వర్యంలో పంచరత్న పౌరాణిక ప్రదర్శన అలరించింది.

– శ్రీకాకుళం కల్చరల్/ సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం



వేడుకలు తిలకించేందుకు హాజరైన నగర ప్రజలు

రథసప్తమి దర్శనాలకు వెళ్లే దారిదే!

- ఖరారు చేసిన అధికారులు
- నేటి అర్ధరాత్రి నుంచే దర్శనాలు ప్రారంభం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి నుంచి జరగనున్న రథసప్తమి మహోత్సవానికి సూర్యదేవాలయ ప్రాంగణ, పరిసరాలన్నీ సంసిద్ధమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల (తెల్లవారితే మంగళవారం) నుంచి ఆలయంలో దర్శనాలను ప్రారంభించనున్నారు. ఈమేరకు దర్శన మార్గాలను అధికారులు ఖరారు చేశారు. రూట్‌మ్యాప్‌ను నగరంలో ప్రధాన కూడళ్లలో క్లాత్ ఫ్లెక్సీలతో ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో వై.భద్రాజీ ఆదివారం తెలిపారు.

దాతల పాసులు(రూ.లక్ష అంతకుమించి విరాళాలిచ్చినవారు)

ఆలయ అభివృద్ధికి, వివిధ రకాలుగా రూ.లక్ష, అంతకంటే ఎక్కువగా విరాళాలు ఇచ్చిన వారికిచ్చే డోనర్ (దాతల) పాసులున్న వారు ప్రధాన రోడ్డులో బొంపాడ వీధి కూడలి నుంచి ప్రత్యేక క్యూలైన్‌లో వస్తారు. ఆలయ సింహద్వారం (ఆర్చిగేట్) నుంచి ఉత్తర ద్వారం పక్కనున్న ప్రత్యేక క్యూలైన్‌లో ఆలయంలోపలికి వెళ్లనున్నారు. ఈ పాసుతో నలుగురికి అనుమతించనున్నారు. అయితే ఈ పాసులకు 3వ తేది అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 4 వ తేది ఉదయం 6 గంటల వరకు మాత్రమే అనుమతివ్వనున్నారు.



బొంపాడ వీధి కూడలి వద్ద దాతలు, అభిషేక సేవ దర్శన మార్గాలు

క్షీరాభిషేక సేవ (రూ.500కి ఇద్దరు అనుమతి): అరసవల్లి ప్రధాన రోడ్డులో బొంపాడ వీధి కూడలి వద్ద నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా వెళ్లనున్నారు. క్యూలైన్‌లోనే ఈ రూ.500 టికెట్ కొనుగోలు చేసుకున్న భక్తులు ఆలయ ప్రధాన ఆర్చిగేట్ మీదుగా ప్రత్యేక లైన్లో నేరుగా రాజగోపురం నుంచి స్వామి వారి దర్శనానికి వెళ్లనున్నారు. సప్తమి రోజున అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ టికెట్‌పై ఇద్దరు దర్శనానికి వెళ్లవచ్చు.

ఉచిత దర్శనాలు

అరసవల్లి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వద్ద నుంచి సాధారణ (ఉచిత) దర్శనాల క్యూలైన్ ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం నగరం, కాజీపేట వైపు నుంచి వచ్చిన భక్తులు ఉచిత దర్శనానికి ఇదే మార్గం. గార, వప్పంగి వైపు నుంచి వచ్చిన భక్తులకు ఉచిత దర్శనాల కోసం అసిరితల్లి అమ్మవారి ఆలయం పక్కన సీసీ రోడ్డులో ప్రత్యేకంగా ఉచిత దర్శన క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఈ రెండు ఉచిత లైన్లు కూడా ఇంద్రపుష్కరిణి ఒడ్డు వద్ద కలిసి పుష్కరిణి చుట్టూ ఉన్న కంపార్ట్‌మెంట్ల నుంచి ఆలయంలోకి దర్శనాలకు వెళ్తారు.



అమ్మవారి ఆలయం పక్కన సీసీ రోడ్డులో ఉచిత, రూ.100 దర్శన మార్గాలు

ప్రత్యేక దర్శన టికెట్టు (రూ.300తో ఒకరికే అనుమతి)

ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన ఈ రూ.300 ప్రత్యేక టికెట్‌తో ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుంది. అదీ ఈనెల 4వ తేదీ ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనాలకు అనుమతించనున్నారు. మొత్తం నాలుగు స్లాట్‌ల ప్రకారం ఈ దర్శనాలుంటాయి. శ్రీకాకుళం ఆర్డీవో అనుమతితో అరసవల్లి యూనియన్ బ్యాంకులో టికెట్ కొనుగోలు చేసిన భక్తులు.. నేరుగా బొంపాడ వీధి కూడలి వద్ద క్యూలైన్లలో (దాతల పాసులు, క్షీరాభిషేక సేవ దర్శనాలైన మార్గాల్లోనే) దర్శనాలకు వెళ్లనున్నారు.

రూ.100 దర్శన టికెట్



మున్సిపల్ స్కూల్ వద్ద దర్శన మార్గం

శ్రీకాకుళం నగరం, కాజీపేట వైపు నుంచి వచ్చిన భక్తులకు అరసవల్లి హైస్కూల్ నుంచే క్యూలైన్లు, అలాగే గార, వప్పంగి నుంచి వచ్చిన వారికి అమ్మవారి ఆలయానికి పక్క సీసీ రోడ్డు వద్ద ప్రత్యేకంగా క్యూలైన్ ఉంది. ఈ రెండు లైన్లు కూడా మళ్లీ ఇంద్రపుష్కరిణి ఈశాన్య రోడ్డులోనే కలిసిపోయి ఒకే మార్గం గూండా ఆలయం ఎదురుగా చేరుకుంటారు. అరసవల్లికి చెందిన గ్రామస్తులు ఆధార్ కార్డు చూపిస్తే ఈ లైన్‌లోనే ఉచిత దర్శనం ఉంటుంది.

వీఐపీ/వీవీఐపీ భక్తులు



అరసవల్లి సింహద్వారం వద్ద దర్శనమార్గం

రాష్ట్రానికి చెందిన వీవీఐపి స్థాయి గల ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు ఆలయ ప్రధాన ఆర్చిగేటు నుంచి నేరుగా అనివెట్టి మండపంలోంచి వెళ్లి మళ్లీ అదే మార్గంలో వెనుదిరిగేలా ఏర్పాట్లు చేశారు. వీరి వాహనాలకు కూడా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అధికారులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నారు.

ప్రత్యేకంగా కేశఖండన శాల



అరసవల్లి హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేశఖండన శాల

ఇక సాధారణ భక్తులతో పాటు మిగిలిన అన్ని దర్శన టికెట్ల భక్తులు కూడా స్వామి దర్శనానంతరం శివాలయం (క్షేత్రపాలకులు) తర్వాత మండపంలో కుడి చేతి వైపునకు కొత్తగా ఓపెన్ చేసిన ఎగ్జిట్ ద్వారం నుంచే నేరుగా బ్రాహ్మణవీధి మీదుగా బొంపాడ వీధి కూడలి ప్రధాన రోడ్డుకు చేరుకునేలా ఈ మ్యాప్ సిద్ధం చేశారు. ఎప్పటిలాగే ఆలయానికి ఉన్న పాత ఎగ్జిట్ మార్గంలో కూడా వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేశారు.రథసప్తమి నాడు తలనీలాల మొక్కులు చెల్లించే భక్తుల కోసం అరసవల్లిలో మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రత్యేకంగా కేశఖండన శాల ఏర్పాటు చేశామన్నారు.